# ఫుట్‌పాత్‌లా.. వ్యాపార కేంద్రాలా?

నడకకు కాదు వ్యాపారానికే | పట్టించుకోని అధికారులు | పాదచారులకు పాట్లు


కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారి ఆక్రమణ

**కంచరపాలెం:** జీవీఎంసీ జోన్–5 పరిధిలోని కంచరపాలెం నుంచి మర్రిపాలెం వెళ్లే ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌లు వ్యాపార కేంద్రాలకు మారిపోయాయి. జీవీఎంసీ నిధులు వెచ్చించి ఆధునీకరిస్తున్న ఫుట్‌పాత్‌లు వ్యాపారాలకే ఉపయోగపడుతున్నాయి. కంచరపాలెం నేతాజీ కూడలి ప్రధాన రహదారికి ఆనుకుని డక్ట్‌లపై ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు వాహనాల పార్కింగ్, దుకాణాల ఏర్పాటు కోసమే నిర్మించినట్టుగా ఉన్నాయి. మర్రిపాలెం 104 ఏరియా, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఐటీఐ జంక్షన్, ఊర్వశికూడలి కంచరపాలెం ముత్యామాంబ జంక్షన్ నుంచి ఇటు తాటిచెట్లపాలెం, అటు జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో ఫుట్‌పాతులను కబ్జా చేస్తున్నారు. పాదచారులు నడిచే ఫుట్‌పాత్‌లపై నిత్యం పార్కింగ్ చేస్తున్నారని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంచరపాలెం రైతుబజారు ప్రహరీకి ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు సాగిస్తూ వాహనాల రాకపోకలకు ఆడ్డంగా నిలుస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో నాయకులు, కార్యకర్తల హవా మితిమీరడంతో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారులు చేస్తున్నారు.

**అడిగేవారేరీ?**

కంచరపాలెం నేతాజీ కూడలి నుంచి మర్రిపాలెం, అటు 104 ఏరియా నుంచి ఐటీఐ జంక్షన్, ఊర్వశి కూడలి మీదుగా తాటిచెట్లపాలెం వెళ్లే సర్వీస్ రహదారుల పక్కనే ఉన్న భవనాల ముందు వ్యాపారాలు నిర్వహించడం వల్ల ఇబ్బందిపడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. వ్యాపార, వాణిజ్య అవసరాలకు వచ్చే వారు వారి వాహనాలను బీఆర్‌టీఎస్ సర్వీస్ రహదారులపై పార్కింగ్ చేస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు ప్రధాన రహదారి ఫుట్‌పాత్‌లకు ఆనుకొని పార్కింగ్ చేసి వెళ్లిపోతురు. గతంలో పార్కింగ్, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలపై పట్టణ ప్రణాళిక సిబ్బంది, కంచరపాలెం ట్రాఫిక్ సిబ్బంది అడ్డుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తిగా గాలికి వదిలేశారు. ఇప్పటికైనా ట్రాఫిక్ ఉన్నతాధికారులు, జోన్–5 పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పర్యవేక్షించి సమస్యకు శాశ్వత పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



దుర్గానగర్ బీఆర్‌టీఎస్ రహదారి ఫుట్‌పాత్‌లపై దుకాణాల సామగ్రి


కంచరపాలెం రైతుబజారు బీఆర్‌టీఎస్ రహదారిలో ఇలా...


శ్రీనగర్ రహదారిలో ఫుట్‌పాత్‌పై దుకాణాలు...

### నడవలేక పోతున్నాం

కంచరపాలెం కూడలి నుంచి ఐటీఐ జంక్షన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. అటుగా రాకపోకలు సాగించాలంటే ఇబ్బందికరంగా ఉంది. ఉదయం సాయంత్రం వేళల్లో ఫుట్‌పాత్‌లు నిండిపోతున్నాయి. రోడ్లపై నడిస్తే ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించాలి.

– పి. త్రివేణి, స్థానికురాలు, ఐటీఐ జంక్షన్

### దౌర్జన్యం చేస్తున్నారు

ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేయడమే కాకుండా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తే దుకాణదారులు దురుసుగా వ్యవహరిస్తున్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేసేవారిని ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకుండా పది నిముషాలు పార్కింగ్ చేసిన వాహనాలకు ఫొటోలు తీసి చలానాలు పంపుతున్నారు. కష్టాలు తీరే మార్గాన్ని అధికారులే చూపాలి.

–దాడి.రాంబాబు, పాదచారు, ఊర్వశికూడలి.



గొల్లకంచరపాలెం దుకాణాల ఎదుట వాహనాలు ఇలా

## క్లుప్తంగా

### ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్స్



రక్షణ లేని ఫ్యూజ్ బాక్స్

ఫోకస్

**మల్కాపురం:** జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ పాఠశాల ఎదురుగా గల ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ పాయింట్ ప్రమాదకరంగా ఉంది. మనుషులకు అందే ఎత్తులో ఉండడంతో పాటు ఫ్యూజులు ఉన్న చోట డోరు లేదు. దీంతో ఇది ప్రమాదకరంగా ఉంది. శ్రీహరిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులు స్పందించాలని స్థానిక వాసులు కోరుతున్నారు.

### పార్టీ కార్యకలాపాల్లో పాల్గొవాలి


ఆడారి నాగరాజును అభినందిస్తున్న మళ్ల విజయప్రసాద్

**మల్కాపురం:** పార్టీ బలోపేతానికి యువత చురుగ్గా పని చేయాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ అన్నారు. పార్టీ నియోజకవర్గ యువజన విభాగ ప్రతినిధిగా నియమితుడైన ఆడారి నాగరాజు ఆదివారం మళ్ల విజయప్రసాద్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నాగరాజుకు శాలువ కప్పి, పూల మాల వేసి అభినందించారు. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పార్టీ యూత్ నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను మళ్ల కట్ చేసి నాగరాజుతో యూత్ లీడర్లకు తినిపించారు.

### సీఎం సహాయ నిధి చెక్కు అందజేత


చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

**మల్కాపురం:** జీవీఎంసీ 58వ వార్డు రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎర్రబాల వసంతకు ఆదివారం ప్రభుత్వ విప్ పి.గణబాబు రూ. 90 వేల చెక్ అందించారు. ఆమె వైద్యానికి సంబంధించి సాయం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా పరిశీలించిన ప్రభుత్వం రూ. 90 వేలు మంజూరు చేసిందని గణబాబు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ దుర్గాప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు ప్రోత్సాహకాల అందజేత


మళ్ల విజయప్రసాద్ సమక్షంలో క్రీడాకారులకు నగదు అందిస్తున్న శ్రీనివాసరావు

**గోపాలపట్నం:** జాతీయ బాక్సింగ్ పోటీలకు వెళ్తున్న క్రీడాకారులకు జీవీఎంసీ 57వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రేసపు శ్రీనివాసరావు ఆదివారం ఆ పార్టీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ సమక్షంలో ఆర్థిక సాయం అందించారు. మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ క్రీడాకారులకు సాయపడడం గొప్పవిషయమన్నారు. ద్రోణా చార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 3 గోల్డు, ఒక సిల్వర్ మెడల్ సాధించారని శబరి కోచింగ్ సెంటర్ కోచ్ గుణ తెలిపారు. వీరు త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పిన్నింటి అప్పలరాజు, నాయకులు శ్రీను, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మోసపూరిత హామీలతో ప్రజలను మభ్య పెట్టారు


కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న మళ్ల విజయప్రసాద్

**సింధియా:** ఎన్నికల్లో ప్రజలకు మోసపూరిత హామీలు ఇవ్వడంతో పాటు కుట్రపూరిత రాజకీయాలు చేసి గెలిచిన కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మాజీ ఎమ్మెల్యే, విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ మళ్ల విజయప్రసాద్ అన్నారు. జీవీఎంసీ 63వ వార్డులో ఆదివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటి కార్యక్రమాన్ని వార్డు అధ్యక్షుడు యలగాడ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వికృత చేష్టలకు ఓటుతో చరమ గీతం పాడే రోజు వస్తుందన్నారు. హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో గల్లా శ్రీను, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పూండీ మల్లేశ్వరరావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలయ ప్రతిష్టను దిగజార్చకండి


జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ ఆలయం

**కంచరపాలెం:** కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం ఈవో సురేష్‌బాబాపై తప్పుడు వార్తలు ప్రచురించడం సరికాదని ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, జ్ఞానాపురం, అచ్చియ్యమ్మపేట గ్రామ పెద్దలు హెచ్చరించారు. ఈ మేరకు జ్ఞానాపురం ఆలయ ఆవరణలో ఆదివారం ట్రస్టు సభ్యులు, గ్రామ పెద్దలు ప్రకటన విడుదల చేశారు. కొన్ని చిన్న వార్తా పత్రికలు, యూట్యూబ్ చానెళ్లు తప్పుడు వార్తలు ప్రచురించి, ఆలయంలో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు చేస్తూ, ఆలయ సిబ్బందిని ఇబ్బందులకు గురి చేయడం సరి కాదన్నారు. దీనివల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటాయన్నారు. పాలకవర్గం సమన్వయంతో ఉత్సవాల నిర్వహణలోనూ, దేవాలయ అభివృద్ధిలోనూ, భక్తులకు సౌకర్యాలు కల్పించడంలోనూ, ఆలయ ఖర్చులు తదితర అన్ని విషయాల్లోనూ పారదర్శకంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఆయన ఈవోగా బాధ్యతలు చేపట్టిన నాటికి ఆలయ వార్షిక ఆదాయం రూ.81.46 లక్షలు ఉండేదని, నేడు రూ.2.62 కోట్లకు పెరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేని నేటి కూటమి నాయకుల ప్రమేయంతో దుష్ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆలయ చైర్మన్ లండా రమణ, ట్రస్టు బోర్డు సభ్యులు ఆదినారాయణ, వి.నారాయణ, శ్యామ్, తేజా, రత్నం, గౌరీ, దానయ్యమ్మ, అచ్చియ్యమ్మపేట, జ్ఞానాపురం ఆలయ సంక్షేమ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### సేవా కార్యక్రమాలతో సంతృప్తి


పేదలకు సాయం అందిస్తున్న సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్యం

**మల్కాపురం:** నిరుపేదలకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం ఉందని సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్య ప్రతినిధులు అన్నారు. కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం పారిశ్రామిక ప్రాంతంలోని పలువురు నిరుపేదలకు వస్త్రాలు,పండ్లు పంపిణీ చేశారు. కళాశాల యాజమాన్య ప్రతినిధి కాస్లీన్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి తమ సంస్థ సేకరించిన నిధులతో పలువురు పేదలకు అవసరమైన సాయం అందించామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సందడిగా స్టీల్‌క్లబ్ వార్షికోత్సవం


వేడుకల్లో ఢీ ఫేమ్ పండు నృత్య ప్రదర్శన

**ఉక్కునగరం:** స్టీల్‌క్లబ్ వార్షికోత్సవ వేడుకలు సందడిగా జరిగాయి. 22వ వార్షికోత్సవం సందర్భంగా ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో కళాకారులు తమ ప్రావీణ్యంతో అలరించారు. ఢీ జోడీ ఫేమ్ పండు, గుణశ్రీలు వివిధ సినీ గీతాలకు చేసిన డ్యాన్స్ ఆహుతులను ఆకట్టుకుంది. బాలు రైడర్స్ డ్యాన్స్ గ్రూప్ వైవిధ్యమైన డ్యాన్స్‌లతో అలరించారు. జబర్దస్త్ ఫేమ్ నూకరాజు, గెడ్డం మురళీ బృందం స్కిట్లు, పంచులతో నవ్వించారు. అంతకు ముందు స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ విభాగాధిపతి, క్లబ్ అధ్యక్షుడు ఎం. మధుసూదనరావు , స్టీల్‌ప్లాంట్ జీఎం డాక్టర్ వి. చిట్టిబాబు, క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి వై. రవికుమార్, కార్యవర్గ సభ్యులు కె.ఎల్. నరసింహం, కృష్ణయ్య, ఎ. రమేష్, జె. రమేష్, భువన్ కిరణ్, వి.ఎన్.వి. రాజు, రంగనాథ్ పాల్గొన్నారు.

## స్మార్టు మీటర్లు మాకొద్దు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

**మల్కాపురం:** అదానీ స్మార్టు మీటర్ ఏ ఇంటికీ బిగించవద్దు అని సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి అన్నారు. స్మార్టు మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ 60వ వార్డు హనుమాన్‌సంజీవ్‌కాలనీలో ఆదివారం నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ స్మార్టు మీటర్లను ప్రజలు వ్యతిరేకిస్తున్నా కూటమి సర్కారు పట్టనట్టు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు నమ్మక ద్రోహం చేయడం కూటమి నాయకులకు తగునా అని ప్రశ్నించారు. స్మార్టు మీటర్ల అంశంపై రాష్ట్రంలో పెద్ద చర్చ జరుగుతున్నా.. దీనిపై ఎల్లో మీడియా ఎందుకు డిబెట్‌లు నిర్వహించ లేకపోతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించి స్మార్టు మీటర్లు అమర్చకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమణ,ఎం.శ్రీనివాస్,సుభాని,రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## రైతుబజార్ తనిఖీ


ఎస్టేట్ ఆఫీసర్‌తో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్

**మల్కాపురం:** జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలోని రైతుబజార్‌ను ఆదివారం అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్ పోతాబత్తుల శ్రీనివాస్ తనిఖీ చేపట్టారు. వినియోగదారులతో మాట్లాడి నోటీసు బోర్డులో పొందుపరిచిన రేట్లు ప్రకారం ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం రేట్లు పట్టిక పరిశీలించారు.అవసరమైన సౌకర్యాలపై అక్కడ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్‌నాయుడు,ఎస్టేట్ ఆఫీసర్ జైసింహా తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ కలయిక.. అపురూప వేడుక


సమావేశమైన కె.కాలనీ ఉన్నత పాఠశాల 1994-95 టెన్త్ విద్యార్థులు

**కంచరపాలెం:** స్థానిక కంచరపాలెం దరి సాంబమూర్తినగర్‌లోని జీవీఎంసీ కె.కాలనీ ఉన్నత పాఠశాలలో 1994–95లో టెన్త్ చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ కలయికతో సందడి చేశారు. 30 ఏళ్ల నాటి జ్ఞాపకాలు, అనుభవాలను చిన్ననాటి స్నేహితులతో పంచుకున్నారు. వివిధ రంగాల్లో ఉద్యోగాలు, పనుల్లో బిజీగా మారిన స్నేహితులు ఖరగ్‌పూర్, కరీంనగర్, ఏలూరు, తాడేపల్లిగూడెం, హైదరాబాద్, బెంగళూర్, ముంబాయ్ వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఉత్సాహంగా గడిపారు. మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ముందుగా అప్పటి ఉపాధ్యాయులను గుర్తు చేసుకుని మృతి చెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం ఆటపాటలు, విందుతో సందడి చేశారు.

## ‘చెత్త’ నిర్వహణ!


గోపాలపట్నం ప్రధాన రహదారిలో దుకాణం వద్ద పేరుకు పోయిన చెత్త


గోపాలపట్నం స్కూల్ ప్రహరీ వద్ద చెత్తని కాల్చేసిన వైనం


మౌర్య సినిమాహాలు వద్ద అప్రోచ్ రోడ్డులో వేసిన చెత్త

**గోపాలపట్నం:** పారిశుధ్యం నిర్వహణపై స్థానికంగా విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ప్రధానంగా రాత్రి వేళ విధులకు హాజరయ్యే వచ్చిన పారిశుధ్య కార్మికులు కొంత సమయం చేసి వెళ్లిపోతున్నారని కొందరు చెబుతున్నారు. వీరిపై జోన్ స్థాయి అధికారుల ర్యవేక్షణ లేక పోవడంతో అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్లపై ఆధారడడంతో వారి ఇష్టారాజ్యంగా సాగుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

**ఎక్కడి చెత్త అక్కడే...**

చాలా చోట్ల చెత్తను ఎక్కడికక్కడే వదిలేస్తున్నారు. కొన్ని చోట్ల అప్రోచ్ రోడ్లలోకి తోసేస్తున్నారు. మరి కొన్ని చోట్ల చెత్తను డక్టుల్లోకి వేసేస్తున్నారని పలువురు చెబుతున్నారు. ప్రధాన రదారిలో తుడిచిన వ్యర్థాలను పోగులు పెట్టి చెత్త తరలించే వాహనంలోకి ఎత్తాలి. కానీ అలా జరగడం లేదని ఆరోపిస్తున్నారు. కనీసం నెలలో రెండు మూడు మార్లయినా ఆకస్మికంగా తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### ఉత్సాహంగా చదరంగం పోటీలు

**పెదగంట్యాడ:** క్రీడాకారులను ప్రోత్సహించేందుకు.. క్రీడా పోటీలు దోహదం చేస్తాయని హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి అన్నారు. చదరంగం క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియంలో చాంపియన్స్ అకాడమీ కోచ్ పట్నాల శివ ఆధ్వర్యంలో ఆదివారం పోటీలు నిర్వహించారు.